
బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, కాలనీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి

దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

వనస్థలిపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ సౌత్ కాలనీలోని భూలక్ష్మీ దేవి, గణపతిస్వామి, వేణుగోపాలస్వామి వార్ల ఆలయ 6 వార్షిక బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఈ మేరకు బుధవారం కార్పొరేటర్ లచ్చిరెడ్డి హాజరై స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఆలయ వార్షికోత్సవాలు కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో..

సరూర్‌నగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ కింది వార్డులో గల శ్రీసీతారామ భక్తాంజనేయస్వామి ఆలయ సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 7వ తేదీ వరకు ఆరు రోజుల పాటు జరుగనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం 5గంటలకు విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షాబంధనం, శాంతిపాఠం, మృత్సంగ్రహణం, హవనం, ధ్వజాదివాసం, ఆరగింపు, శాత్తుమర తదితర కార్యక్రమాలతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ముఖ్యమైన కార్యక్రమాల్లో భాగంగా గురువారం రాత్రి 7గంటలకు హనుమత్ వాహనసేవ, శుక్రవారం రాత్రి 7గంటలకు గరుడసేవ, శనివారం రాత్రి 7గంటలకు స్వామి వారి ఎదుర్కోళ్లు ఉంటాయని, వీటితో పాటు ఆయా రోజుల్లో నిత్య పూజలు, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు సైతం కొనసాగుతాయని ఆలయ కమిటీ ఛైర్మన్ ఏనుగు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఇక శ్రీరామనవమి రోజైన ఆదివారం ఉదయం 11గంటలకు సీతారాముల కల్యాణోత్సవం, సాయంత్రం 6గంటలకు పుష్పక విమాన శృంగార రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. చివరి రోజైన సోమవారం ఉదయం మహాపూర్ణాహుతి, శతఘటాభిషేకం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి, రాత్రి 8గంటలకు ఆశీర్వచనం, మంగళాశాసనంతో ఉత్సవ సమాప్తి చేయనున్నట్లు ఛైర్మన్ పేర్కొన్నారు.

నేటి నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

వనస్థలిపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం హిల్‌కాలనీలోని సీతారామచంద్రస్వామి 27వ బ్రహ్మోత్సవాలు నేటి(గురువారం) నుంచి ఈనెల 8వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు తురుముగోటి లక్ష్మారావు, ప్రధాన కార్యదర్శి చింతల రవికుమార్‌లు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ సభ్యులతో కలిసి బ్రహ్మోత్సవ ఆహ్వాన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులు, కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు భవాని ప్రమోద్‌కుమార్, విజయ్‌కుమార్, వెంకట్‌నారాయణ, విద్యాసాగర్‌రావు, పి.సత్యనారాయణ, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పనిసరి : జెడ్సీ


శ్రీనివాస్‌గౌడ్ దంపతులను సత్కరిస్తున్న జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్, ఉప కమిషనర్


ఎల్బీనగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరని జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్ అన్నారు. జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ ఏఎంసీ సీహెచ్ శ్రీనివాస్‌గౌడ్, టీఐ డి. నర్సింగ్‌రావుల ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం సరూర్‌నగర్ జ్యోతి క్లబ్‌లో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది వారిని ఘనంగా సన్మానించారు. శ్రీనివాస్‌గౌడ్, నర్సింగ్‌రావులు నాలుగు దశాబ్దాలుగా వివిధ హోదాల్లో పని చేసి మంచిపేరు తెచ్చుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ జోన్ జాయింట్ కమిషనర్ కృష్ణకుమారి, హయత్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, సరూర్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ సుజాత, ఏఎంసీలు దినేష్‌సింగ్, మహేందర్, ఎంఏ ఖదీర్, శ్రీనివాస్, రవికుమార్ పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ శిక్షణతో మానసిక ధైర్యం

కొత్తపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఆత్మరక్షణకు మానసిక ధైర్యానికి దోహదం చేస్తుందని కుంగ్‌ఫూ ఇండియన్ గ్రాండ్ మాస్టర్ సీహెచ్.మదన్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన న్యూనాగోల్‌లోని ట్రస్టెడ్ అడ్వకేట్స్ అసోసియేషన్ భవన ఆవరణలో మంకీ కుంగ్‌ఫూ అసోసియషన్ వారి బ్లాక్ బెల్టు ఫిఫ్త్ డాన్ బెల్టు అర్హత పరీక్షను ఆయన నిర్వహించారు. సుమారు 30 మంది పరీక్షలకు హాజరయ్యారు. బ్లాక్‌బెల్ట్ ఫిఫ్త్ డాన్ బెల్టు సాధించిన వారికి బెల్టులు ప్రదానం చేశారు. ఇండియన్ గ్రాండ్ మాస్టర్ సీహెచ్.మదన్‌కుమార్‌ను అసోసియషన్ ప్రతినిధులు శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. బ్లాక్‌బెల్ట్ ఫిఫ్త్ డాన్ బెల్టు సాధించిన అంబాల శ్రీనివాస్, రాజారావు, అల్లునూరి, బచ్చల అంజన్న, ఏ. పురుషోత్తం, సుధాకర్, మాస్టర్లు పాల్గొన్నారు.

'రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి'

కొత్తపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎలైట్ హోటల్‌లో ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ, ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు కోరారు. బుధవారం న్యూ నాగోల్‌లోని సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల కార్యాలయం ఎస్‌ఏ డాంగే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మహాసభపై మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల భద్రతకు భరోసా లేదని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణ, పోరాటాలు, వారు ఎదుర్కొనే పలు సమస్యల నివారణకు, చట్టపరిధిలో చేయూత తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి, ఎల్బీనగర్ నియోజకవర్గ నాయకులు రాములుగౌడ్, మద్దిలేటి అంకన్న, వీరాస్వామి పాల్గొన్నారు.



సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గిరిజన సంఘాల జేఏసీ నాయకులు

ట్రైకార్ బకాయి రుణాలు విడుదల చేయాలి

● గిరిజన సంఘాల జేఏసీ నేతలు

ఎల్బీనగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రూ. 219కోట్ల ట్రైకార్ బకాయి రుణాలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముడావత్ ధర్మానాయక్, ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాణాపురం రము, రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు కండాల వెంకటేష్, గిరిజన సమాఖ్య రాష్ట్ర సీనియర్ నాయకుడు శంకర్‌నాయక్, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జర్పుల శివనాయక్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ముడావత్ గోపీనాయక్, నాయకులు మేడ సుశీల, బానోతు భిక్షునాయక్, లోక్యనాయక్, కృష్ణనాయక్, రవినాయక్, శివనాయక్, సరిలాల్ నాయక్, రమావత్ చత్రునాయక్, రెడ్యానాయక్, ఉపేంద్ర, రాధిక, బీరయ్య, వీరన్న, వనం నాగయ్య, శ్రీను, అర్జున్, అంజి పాల్గొన్నారు.

దోమలతో పరేషాన్..!



● పడకేసిన ఫాగింగ్.. విజృంభిస్తున్న దోమలు
● కంటిమీద కునుకు లేదంటున్న మూసీ పరీవాహక ప్రాంతవాసులు

దిల్‌సుఖ్‌నగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మూసీ పరీవాహక ప్రాంత కాలనీల ప్రజలు దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం దోమల నివారణకు సరైన చర్యలు చేపట్టకపోవడం మూలంగా కాలనీవాసులు దోమకాటుకు గురవ్వాల్సి వస్తుందని బాధితులు ఆరోపిస్తున్నారు. ఫాగింగ్ పడకేయడంతో దోమలు విజృంభిస్తున్నాయి. సాధారణంగా వర్షాకాలంలో దోమలు ఎక్కువగా వస్తాయి.. కానీ ప్రస్తుతం ఎండలు విపరీతంగా ఉన్నప్పటికీ దోమల బెడద మాత్రం తప్పడం లేదు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని మూసీ పరీవాహక ప్రాంతాలను దోమలు ముంచెత్తుతున్నాయి. మూసీ చుట్టుపక్కల దుర్గంధపు నీటినిల్వలు, చెత్తాచెదారం పేరుకుపోవడంతో ఆ ప్రాంతం దోమలకు ఆవాసంగా మారింది. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో దోమలు విజృంభిస్తు కాలనీవాసులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నవి. మూసీ పరీవాహక ప్రాంతాలైన ద్వారకాపురం, భవానీనగర్, విద్యుత్‌నగర్, గణేష్‌పురికాలనీ, చైతన్యపురి ఫణిగిరికాలనీ, మారుతినగర్, వికాస్‌నగర్, ప్రభాత్‌నగర్ కాలనీల్లో ఇళ్లలోంచి బయటకు వెళ్లాలంటే కాలనీవాసులు జంకుతున్నారు. కిటికీలు తీయాలన్నా, డోర్లు తెరవాలన్నా గృహిణులు జంకుతున్నారు.

సాకులనేకం.. చర్యలు శూన్యం..!

దోమల మూలంగా ఇంటి బయటకు వచ్చి నిలబడలేకపోతున్నా.. ఇంట్లో కంటినిండ కునుకు కూడా తీయలేని పరిస్థితులున్నాయని సరూర్‌నగర్ సర్కిల్ ఎంటమాలజీ విభాగం అధికారులకు ఎన్ని మార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ప్రతి రోజు ప్రతి కాలనీలో ఫాగింగ్ చేయాలని విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఫాగింగ్ చేసే వాహనం పాడైందని ఓ వారం, సిబ్బంది లేరని మరో వారం ఇలా అనేక సాకులు చెబుతూ రోజుల తరబడి ఫాగింగ్ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 2-3 కిలోల మీటర్ల పరిధిలో మొత్తం డివిజన్ విస్తీర్ణం ఉంటుంది. అలాంటి డివిజన్‌లో సరిగా ఫాగింగ్ చేసుకుంటు వెళ్లితే ఉదయం, సాయంత్రం ఐదారు గంటల్లో అన్ని కాలనీలలో సులువుగా ఫాగింగ్ పూర్తి చేయవచ్చు. కానీ ఒక్కో రోజు ఒక్కో కాలనీలో మాత్రమే ఫాగింగ్ చేస్తామంటు తాత్సారం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం రోజు విడిచి, రోజు అయినా ఫాగింగ్ జరిగేలా చర్యలు చేపట్టాలని విన్నవిస్తున్నారు.

డెంగీ, మలేరియా భయం..

దోమలు కాలనీలలో గుంపులు, గుంపులుగా తిరుగుతూ కుడుతుండడం మూలంగా డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ద్వారకాపురం కాలనీలో ఓ వ్యక్తి ఇంటి బయట నిల్చొని స్నేహితులతో మాట్లాడుతుండగా దోమలు కుట్టడంతో రక్తం వచ్చిందని వాపోతున్నారు.

అధికారులు 10 నిమిషాలు నిల్చుంటే పరిస్థితి తెలుస్తుంది



జీహెచ్ఎంసీ అధికారులు మూసీ పరీవాహక ప్రాంత కాలనీలకు వచ్చి ఓ పది నిమిషాలు రోడ్డుపై నిల్చుంటే దోమల తీవ్రత ఏవిధంగా ఉందో అర్థం అవుతుంది. రెండు నిమిషాలు కూడా నిల్చోలేని పరిస్థితులున్నాయని అధికారులకు విన్నవించినా వారు దోమల విజృంభణ తీరును అర్థం చేసుకోవడం లేదు. గుంపులు, గుంపులుగా ఇళ్లలోకి వస్తుండడంతో వ్యాధు లు ప్రబలుతాయనే ఆందోళన చెందుతున్నాం.

- శశిధర్‌రెడ్డి, ద్వారకాపురం కాలనీ

నిలబడలేం.. బయటకు రాలేని దుస్థితి



దోమల మూలంగా బయట నిలబడలేకపోతున్నాం. ఇరవై నాలుగు గంటలు ఇంట్లో కూర్చోలేకపోతున్నాం. ఎండ వేడిమిని తాళలేక సాయంత్రం, రాత్రి సమయాల్లో కొద్దిసేపు చల్లగాలికి బయటకు వస్తే దోమ కాటు మూలంగా రోగాల బారిన పడాల్సి వస్తుంది. తమ బస్తీలో దోమల విజృంభణ మరి ఎక్కువగా ఉంది. ప్రతి రోజు ఫాగింగ్ చేయాలి.

- సుశీలమ్మ, మున్సిపల్‌కాలనీ

ముగిసిన పది పరీక్షలు


ఉపాధ్యాయులతో కలిసి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తామంటూ సంకేతమిస్తున్న వీఎంహోం విద్యార్థినులు

మన్సూరాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గత నెల 21వ తేదీ నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 2వ తేదీ బుధవారంతో ముగిశాయి. కాగా చివరిరోజైన బుధవారం నాగోల్, మన్సూరాబాద్ డివిజన్ల పరిధిలోని పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల్లో సంతోష వాతావరణం కనిపించింది. పరీక్షలు ముగియడంతో పరీక్షా కేంద్రం నుంచి చాలా సంతోషంగా బయటకు వచ్చి తమ తమ స్నేహితులను, కేంద్రాల వద్ద వేచి ఉన్న తమ తల్లిదండ్రులను ఆప్యాయంగా కలుసుకుని పరీక్షలు రాసిన తీరును చర్చిస్తూ సంతోషంగా కనిపించారు. ముఖ్యంగా తమ తమ స్నేహితులతో పేపర్ ఎలా వచ్చింది? పరీక్ష ఎలా రాశావ్? ఎప్పుడు కలుద్దాం? హాలీడేస్ ప్లానింగ్ ఏంటీ? అంటూ పలకరించుకోవడం కనిపించింది. చివరి రోజు కావడంతో తమ తమ స్నేహితులతో ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు.


బీఎన్‌రెడ్డినగర్‌లోని ఓ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల కోలాహలం

వనస్థలిపురం : పదవ తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిసాయి. పరీక్ష చివరిరోజు కావడంతో విద్యార్థులు పరీక్షా రాసిన అనంతరం గుంపుగుంపులుగా తమ స్నేహితులతో కలిసి బయటకు వచ్చారు. దీంతో పరీక్షా కేంద్రాల వద్ద సందడి వాతావరణం ఏర్పడింది. విద్యార్థులు తమ తల్లిదండ్రులతో ఇంటికి వెళ్లే సమయంలో బాధగా వీడ్కోలు పలుకుతూ పరీక్షా కేంద్రం నుంచి వెనుతిరిగి పోయారు.

బహుజన వీరుడు పాపన్న


పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

మన్సూరాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తన పోరాటంతో శిస్తు వసూళ్లతో పీడింపబడుతున్న బడుగు, బలహీనవర్గాలను దాని నుంచి విముక్తి కల్పించిన మహనీయుడు, బహుజన వీరుడు నాసగోని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డిలు పేర్కొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని పురస్కరించుకుని ఎల్బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద బుధవారం వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సామ రంగారెడ్డిలు పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ ఎల్బీనగర్‌లో మలిదశ ఉద్యమకారుడు శ్రీకాంతాచారి విగ్రహ ఏర్పాటు వలే పాపన్న వర్ధంతి సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తొలి, మలిదశ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహాన్ని సైతం ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, నాయికోటి పవన్‌కుమార్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్, కొర్లపల్లి స్వామి, నాగిరెడ్డి, కృష్ణంరాజు, జంగారెడ్డి పాల్గొన్నారు.

కొత్తపేట : బహుజనుల అభ్యున్నతికి నిరంతరం పాటుబడిన సర్వాయి పాపన్నకు బుధవారం బీసీ హక్కుల సాధన సమితి ప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. న్యూనాగోల్‌లోని సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల కార్యాలయం ఎస్‌ఏ డాంగే భవన్‌లో నాయకులు సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రతినిధి బొడ్డపల్లి కృష్ణ, నాయకులు మల్లేష్, బీ.అఖిల్, మల్లేష్, రవి, ఆంజనేయులు పాల్గొన్నారు.

లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాట్లను అడ్డుకోవడం సహించరానిది


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు సామ రంగారెడ్డి

వనస్థలిపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో కీలకపాత్ర పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాట్లను పోలీసులు అడ్డుకోవడం సహించరానిదని బీజేపీ రాష్ట్ర నాయకుడు సామ రంగారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ కూడలి వద్ద బుధవారం కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటు కోసం భూమిపూజ చేయడానికి బీసీ కులాల సమన్వయ వేదిక అధ్యక్షుడు బొమ్మ రఘురామ్ నేత తమ బృందంతో కలిసి బీఎన్‌రెడ్డినగర్‌లోని తన నివాసం నుంచి ఎల్బీనగర్‌కు బయలుదేరుతుండగా పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ మేరకు సమాచారం అందుకున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు సామ రంగారెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డిలు రఘురామ్‌నేతకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తెలంగాణ జాతిపితగా అభివర్ణించిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటుకు ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. మూడు తరాల ఉద్యమ నాయకుడు, ఆజన్మాంతం ప్రత్యేక తెలంగాణ కోసం పరితపించిన కొండా లక్ష్మణ్ బాపూజీకి గుర్తింపుగా బీసీ కులాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే విగ్రహ ఏర్పాట్లను ప్రభుత్వం అడ్డుకోవడం మానుకోవాలని హితువు పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లచ్చిరెడ్డి, పవన్‌కుమార్, బీసీ సంఘాల నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మానసలో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం

● ఆటిజం పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర - సవాళ్లను అధిగమించడం పై సెమినార్

కొత్తపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్య శిశువుల కోసం గర్భస్థ సమయంలో తల్లులు మానసిక స్థితిపైన దృష్టి సారించాలని హై టెక్ సిటీ యశోద ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డా. ఎం.విజయసారధి వెల్లడించారు. ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా బుధవారం కొత్తపేటలోని మానస చిన్నారుల ఆరోగ్య వైకల్యాల సంస్థలో ఆటిజం పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర - సవాళ్లను అధిగమించడంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. గర్భస్థ స్థితిలో తల్లి ఆహారపుటలవాట్లు, ఆరోగ్యం, చక్కటి మానసిక పరిస్థితి, అలవాట్లు తదితర అంశాలు గర్భంలో పెరిగే శిశువుపై ప్రభావం చూపుతాయన్నారు. ఆటిజం పిల్లలను ప్రత్యేక అవసరాలు, ప్రత్యేక ప్రతిభ గల పిల్లలుగా చూడాలని తెలిపారు. వారిలో కనిపించే ప్రతిభకు అనుగుణంగా వారిని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. గౌరవ అతిథి సూర్యాపేట ప్రభుత్వ వైద్య కళాశాల బయోకెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ డా.టీ.పావనికిరణ్మయి, సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయోగ్నస్టిక్స్ (సీడీఎఫ్‌డీ) మిషన్ ప్రోగ్రాం ఆన్ పీడియాట్రిక్ రేర్ డిజార్డర్స్ సైంటిస్ట్ డా.నీరజ చిలుకోటి, సీడీఎఫ్‌డీ మరో శాస్త్రవేత్త డా. అంజనాకర్ అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు అడిగిన ప్రశ్నలకు అతిథులు సమాధానాలిచ్చారు. ఆటిజం పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు ఆట్టుకున్నాయి. కార్యక్రమంలో మానస సైకాలజీ విభాగం అధిపతి జకియా మన్సూర్, ఉపాధ్యాయులు, థెరపిస్టులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో మోదీ ఫొటో ఏర్పాటు చేయాలి


బాలాపూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

సరూర్‌నగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతి రేషన్ షాపులోనూ ప్రధాని మోదీ ఫొటో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని, సన్నబియ్యం పథకంలో కేంద్రం వాటా ఎంతో తెలిసే విధంగా బోర్డులు సైతం ఏర్పాటు చేయాలని బడంగ్‌పేట్ కార్పొరేషన్ బీజేపీ నేతలు అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవికి వినతిపత్రం అందజేశారు. అదే విధంగా తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేయడానికి గాను మోదీ ఫొటోను సైతం ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ సన్న బియ్యం పథకంలో నలుగురు సభ్యులు ఉన్న కుటుంబానికి పంపిణీ చేసే 24కిలోల ఉచిత బియ్యంలో 20 కిలోలు కేంద్ర ప్రభుత్వమే భరిస్తున్నదని అన్నారు. కేవలం నాలుగు కిలోలు మాత్రమే ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మొత్తం తానే భరిస్తున్నట్లు ప్రజలను మభ్య పెడుతున్నదని, ఈ విషయం లబ్ధిదారులకు తెలియాల్సిన అవసరం ఉన్నదని వారు పేర్కొన్నారు. బియ్యం తీసుకున్న లబ్ధిదారులు వెంటనే డీలర్ నుంచి రసీదు తీసుకుంటే దానిపై పూర్తి వివరాలు ఉంటాయని వారు అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు నడికుడ యాదగిరి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్లు బంగారు అనితాప్రభు, గౌర రమాదేవిశ్రీనివాస్, గూడెపు ఇంద్రసేన పాల్గొన్నారు.

కేంద్రం సహకారంతోనే సన్న బియ్యం పథకం : శంకర్‌రెడ్డి

కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పథకం అమలు చేస్తున్నదని, కేంద్రం సాయం లేకుండా ఒంటరిగా ఈ పథకాన్ని అమలు చేసే సత్తా రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నదా? అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం బాలాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఒక్కో లబ్ధిదారుడికి అందజేసే ఆరు కిలోల్లో ఐదు కిలోలు కేంద్రమే ఇస్తున్నదన్నారు.



ఒకప్పుడు గౌడన్నలు తాటి, ఈత కల్లు కోసం గాజు సీసాలు(ఖాళీ బీరు బాటిళ్లు) ఉపయోగించే వారు. కల్లు బాబులకు వాటిలోనే నింపి ఇచ్చే వారు. రానురాను గాజు సీసాలు దొరకడం కష్టంగా మారగా.. ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, కూల్ డ్రింక్స్ బాటిల్స్ వైపు గౌడన్నలు దృష్టి సారించారు. గాజు సీసాలో(బీరు సీసాలో) కల్లు లీటరు కన్నా తక్కువే పడుతుంది. అదే వాటర్ బాటిల్‌గానీ, పెద్ద కూల్ డ్రింక్ బాటిల్‌గానీ అయితే రెండు లీటర్లదాకా పడుతుంది. దాంతో గౌడ సోదరులు వాటి వాడకం ఎక్కువ చేశారు. తన వద్దకు వచ్చే కల్లు ప్రియులకు నింపి ఇవ్వడానికి తన ద్విచక్ర వాహనానికి 20కి పైగా ప్లాస్టిక్ బాటిళ్లు కట్టుకుని వెళ్తున్న ఓ గౌడన్న. నగర శివారు తుర్కయంజాల్ మునిసిపాలిటీలోని రాగన్నగూడలో కనిపించిందీ దృశ్యం..!

- సరూర్‌నగర్/హయత్‌నగర్, ఆంధ్రజ్యోతి

'సన్న బియ్యంతో పేదల కడుపునింపుతున్న ప్రభుత్వం'

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సన్న బియ్యం పంపిణీ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కడుపునింపుతుందని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ భాస్కరాచారి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గండిచెరువు గ్రామంలో బుధవారం సన్నబియ్యం పథకం పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట మేరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి ఇంద్రాసేనారెడ్డి, సెక్రెటరీ రాజశేఖర్‌రెడ్డి, జక్క కృష్ణారెడ్డి, కొండల్‌గౌడ్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రూప్-1 ర్యాంకర్ కృతికకు సన్మానం

సరూర్‌నగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకు సాధించిన మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడకు చెందిన సిద్దాల కృతికను.. ఆమె పదో తరగతి చదివిన ఇక్కడి భాష్యం స్కూల్ యాజమాన్యం బుధవారం ఘనంగా సన్మానించింది. కృతిక ఈ స్కూల్‌లో 2011-12 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివి పది జీపీఏ సాధించింది. ఈ క్రమంలో తమ స్కూల్ విద్యార్థి గ్రూప్-1లో 5వ ర్యాంకు సాధించినట్లు తెలుసుకున్న స్కూల్ యాజమాన్యం కృతికను బుధవారం తమ పాఠశాలకు ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. భాష్యం ఛైర్మన్ రామకృష్ణ, సీఈవో చైతన్య, జడ్ఈవో అంకమ్మరావు, స్కూల్ ప్రిన్సిపాల్ స్రవంతి, అప్పారావు, లిటిల్ ఛాంప్స్ ప్రిన్సిపాల్ శృతి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల సన్మానం

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని మామిడిపల్లికి చెందిన బీఆర్ఎస్ ఓబీసీ సెల్ జిల్లా నాయకుడు నిమ్మల నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం కృతికను ఆమె నివాసంలో కలిసి ఘనంగా సన్మానించి అభినందించారు. నాయకులు సిల్వేరి సాంబశివ, ఎరుకలి మంగరవిగౌడ్, లతాశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

బార్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్

● ఒకరి అరెస్ట్, మరొకరు పరార్

సైదాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బార్‌లో కూర్చొని క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ఒకరిని సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేయగా మరొకరు పరారయ్యారు. సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివగంగా బార్ అండ్ రెస్టారెంట్‌లో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నారని పోలీసులకు మంగళవారం రాత్రి సమాచారమందడంతో బార్‌పై దాడిచేశారు. ఆ సమయంలో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ఎం. రమేష్ బాబును అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నగదు రూ.12,280, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతడితో పాటు బెట్టింగ్ చేస్తున్న లాలూ యాదవ్ పరారీలో ఉన్నట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు.

స్పృహ తప్పి పడిపోయిన బిచ్చగాడు

● ఆస్పత్రికి తరలించిన పోలీసులు

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): భిక్షాటన చేసి జీవనం సాగిస్తున్న వ్యక్తి బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా స్పృహ తప్పి కింద పడిపోయాడు. దీంతో అతనికి గాయాలయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే చాదర్‌ఘాట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు చేరుకుని స్పృహ తప్పి పడిపోయిన బిచ్చగాడిని చికిత్స కోసం 108లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన బిచ్చగాడు ఎవరనే వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.


సన్నబియ్యం కోసం లింగోజిగూడ కామేశ్వర్‌రావుకాలనీలోని రేషన్ షాపు వద్ద సంచులను క్యూలో పెట్టిన లబ్ధిదారులు


రేషన్‌షాపు తెరిచిన వెంటనే క్యూలో లబ్ధిదారులు